# చేజారిన అవకాశం

"రెండు కట్టెలు కొట్టుకొచ్చాయి - ఆడదొకటీ మగదొకటీ" అన్నాడు జోగులు గట్టువెంట నడుస్తూ.

"ఎటువేపు?" ప్రశ్నించాడు రాములు చుట్ట కొరికి ఉమ్మేస్తూ.

''ఆ వేపునుంచి మనేపుకు వచ్చినయ్''

"చూపించు'' ఇద్దరూ నడుస్తున్నారు కాలవగట్టున.

ఫర్లాంగు దూరంలో రేవుదగ్గర జనం మూగారు. బిందెలు బుజాన పెట్టుకున్న యువతులూ, గొడ్లమీద చెయ్యేసుకుని నిలబడ్డ గోపాలురూ, బల్లకట్టు సుబ్బయ్యా, మిరపచేను ఆసామి వీరయ్యా నడుముమీద చెయ్యి పెట్టుకుని చూస్తున్నారు.

''ఈళ్ళిద్దరూ ఒక్కసారే పడినట్టా?" గుంపులోనుంచి వినవడ్డది.

ఒక్కసారే పడక్కర్లేదు. ఒక దిశగనె కొట్టుకొచ్చేవి వెనక ముందులుగా పడ్డా వాలుగా ఉన్న చోటికి వచ్చి చేర్తాయి.

వాళ్ళల్లో ఇద్దరు కర్రతో ఇంకా ముందుకు పోకుండా అపుచేసి ఒడ్డుకు లాక్కొచ్చారు. నీళ్ళు కక్కించి ప్రథమచికిత్స చేశారు వాళ్ళకు.

"ఎప్పుడు పడ్డారోగాని ప్రాణాలున్నాయి'' కాలవ ఒడ్డున జనం బాగా మూగారు.

అరికాళ్ళూ, అరచేతులూ రుద్ది వాళ్ళకు వేడి తెప్పిస్తున్నారు.

కొంతసేపటికా పురుషుడు కళ్ళుతెరిచి చుట్టూరా చూశాడు. జనాన్ని పరకాయించి చూశాడు. తెలిసిన ముఖమొకటయినా లేదు.

పక్కకు తిరిగాడు. తనపక్కన స్త్రీ శరీరము.

ఆమె ఎవరు? తనలాగే నీళ్ళల్లో కొట్టుకొచ్చినట్టుంది.

కొసగంటితో పరికించాడు.

పాతికేళ్ల పిల్లయి ఉంటుంది. ఆ ముఖాన్ని చూసిన జ్ఞాపకం ఎక్కడా తగలటంలేదు.

ఆలోచిస్తున్నాడు తలమీద చేత్తో రాసుకుంటూ.

అంతలో వేడివేడి పాలు తెచ్చారు చెంబుతో. ఒకరు దగ్గరకూర్చుని నోట్లో పోస్తుంటే చంచా తరువాత చంచా గుటకలేస్తున్నాడు. గ్లాసెడు పాలు తాగిన తరువాత కొంచెం శక్తి వచ్చినట్లయింది.

అతడలా చూస్తుంటే ఎవరో అడిగారు- "ఏ ఊరు బాబు మనది?"

''కొవ్వూరు'' తల తడిమి చూసుకున్నాడు.

"ఈ ఆడకూతురు మనతాలూకేనా? చెల్లెలా భార్యనా?"

అతడు పక్కకు తిరిగి మళ్లీ ఆమె ముఖంలోకి చూశాడు. ఎంతసేపు చూసినా తెలిసిన ముఖమనిపించలేదు. చేతివేళ్లతో నుదురు రుద్దుకున్నాడు. ప్రాపు లోకి వేళ్ళుపోనిచ్చి కనుబొమ్మలు పైకెత్తాడు. కళ్ళుమూసుకుని "ఆం . . . మా తాలూకే" అన్నాడు.

వాళ్లల్లో ఒకరు పరుగెత్తుకెళ్ళి ఒక చీర తెచ్చి ఆమె మెడవరకూ కప్పారు. మరొకరు బొట్టుతెచ్చి పెట్టారు. ఒక ఆడమనిషిని తీసుకువచ్చి ఆమెపక్కన కూర్చోబెట్టారు.

అది చాలా చిన్న గ్రామము. పక్కఊళ్లో జరిగిన ఎన్నికలకు గ్రామస్తులు భాగాలుగా చీలి తమలో తమకున్న సంబంధ బాంధవ్యాలను కూడా చూచుకో కుండా హైరానపడ్డారు. గెలిచిన పార్టీని వదిలిపెట్టి మిగతా మూడుపార్టీలు ఇప్పు డిప్పుడు కాస్త కోలుకొని పలకరించుకుంటున్నాయి అటువంటి సమయంలో అందరికీ ఆసక్తికరమైన విషయంగా మారింది జోడామనుషులు కాలవలో కొట్టుకు రావటం.

ఆ యిద్దరికీ కాస్త తెలికపడ్డదనిపించిన తరువాత- లోగిలి కాస్త పెద్దదిగా

ఉన్నదనిపించిన ఇంటికి బండిమీద తీసుకెళ్ళారు. మండువాలో రెండు నులక మంచాలు వేసి దుప్పట్లు పరచారు.

"శేషగిరిబాబో! ఎట్టుండాది ఒంట్లో?" రెండురోజులు ఊరుకుని మూడోనాటి నుంచీ ఒక్కొక్కరూ అడగటం మొదలుపెట్టారు.

"బాగానే ఉంది'' అంటూ లేచి కూర్చున్నాడు శేషగిరి.

మంచం చుట్టూ పదిమంది కూర్చున్నారు.

"ఆడ ఏంచేసేటోడివి బాబో?"

"నేనక్కడ స్కూలు టీచర్ని.''

"మీది పెద్ద కుటుంబమా బాబయ్యా?''

"కాదు''

"అయితే ఇక్కడున్న బడిలో చదువు చెబుతూ మా కండ్లముందర ఉండ కూడదూ?"

"ఉండచ్చు. కాని అది స్వగ్రామం కదా, మీరందరూ ఏదయినా పని చెప్పండి చేస్తాను. ఆ కూలిడబ్బులతో మా ఊరు చేరుకుంటాము.''

"అట్లనకు బాబూ, ఇక్కడ మేమందరం కలసి ఒక చిన్న బడి పెట్టాము కొన్నాళ్ళు బాగానే నడిచింది. ఆ తరువాత మాలో మాకు పోట్లాటలొచ్చి సరిగా నడపలేదు. బడి పెట్టేటప్పుడు జీతాలకోసం చందాలు పోగుచెయ్యాలనుకున్నాం. తరువాత వచ్చిన ఈ తగాదాలవల్ల చందాలు వసూలుచెయ్యలేదు. బడి మూసి వేయవలసి వచ్చింది. మీరు బడి నడుపుదామంటే చందాలు పోగుచేస్తాం ఏమంటారు?" అన్నాడొక ఆసామి.

"ఎట్లగబ్బా?" అన్నాడు శేషగిరి.

"మా వాళ్లందరూ ఏదో ఒక ఆశ పెట్టుకునే మీ యిద్దరినీ కాపాడారు"

''కాపాడినందుకు మేము కృతజ్ఞులమే. ప్రాణదానం చేశారు."

ఆరోజు సాయంత్రంవరకూ ఒక్కొక్కరు వచ్చి బడిసంగతే మాట్లాడారు.

"నీ భార్య కూడా చదువుకున్నదా?" ఒకాయన అడిగాడు.

శేషగిరికి ఏం చెప్పటానికీ తోచలేదు. ఆమె చదువుకున్నదో లేదో అతడికి తెలియదు. తనకు తెలియదన్న సంగతి చెప్పదలచలేదు.

"చెప్పకపోతె మానె. ఎంత చదువొచ్చినా సరే. ఇద్దరూ బడిలో పని చెయ్యండి. పిల్లలను ఇంటినుంచయినా తీసుకురాగలుగుతుంది గదా."

శేషగిరి అతడిని బాగా గమనించి చూశాడు. మనిషి చాలా హుందాగా వున్నాడు. తెల్ల బట్టలూ-కాళ్లకు చెప్పులూ కళ్ళజోడూ- ఆ గ్రామాన్నంతా అతడే నడిపిస్తున్నట్లున్న మాటలు శేషగిరిని ఆలోచనలోకి దింపాయి.

"పొద్దుపోయింది. భోజనాలు చేసి పడుకోండి. ఇంటిస్థలము ఒకచోట విచారించి వచ్చాను. మరొకచోట వాటి దూలాలు, కమ్మలు మాట్లాడి వచ్చాను. రెండు రోజుల్లో ఇల్లు తయారుచేయిస్తా."

శేషగిరి భోజనం చేసి మంచమ్మీద వాలుతూ పక్కమంచమ్మీద అప్పటికే వచ్చి పడుకున్న ఆమెను చూశాడు.

కళ్లు తెరచి అతడినే చూస్తున్నది ఆమె.

"ఇప్పుడు వీళ్లందరూ అంటున్న మాటలు వినే ఉంటారు. ఏం చెయ్యాలని మీ ఆలోచన?''

ఆమె చంగున లేచి కూర్చుంది.

"నిన్నటినుంచీ ఎవరితోనయినా మాట్లాడారా?"

తల తిప్పింది.

"ఏం? ఏదో ఒక మాట మాట్లాడితే సంతోషిస్తారుగా? మనను కాపాడారు. కృతజ్ఞతలు చెప్పవలసిన ధర్మంకదా?''

ఆమె దోసిట్లో ముఖం పెట్టుకుని చూస్తోంది.

''మీకు ఇంకా ఇక్కడ ఉండాలని ఉందా?" అతడు కంఠధ్వని తగ్గించి మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె తన చూపులు తిప్పేసుకుంటూ మూతి విరిచింది.

అతడు పాతకాల సంగతి చెప్పి గ్రామప్రజల అభ్యర్థనను గురించి వివరించాడు.

"మనం ఏదో ఒక సమాధానం వాళ్ళకు చెప్పాలి. తెల్లవారితే పదిమందివచ్చి కూర్చుంటారు. ముందుగా మనం ఒక నిర్ణయానికి రావాలి."

ఆమె మౌనంగా వింటూ కూర్చుంది.

"మనను వాళ్లంతా భార్యాభర్తలుగా భావిస్తున్నారు. అందుకని నన్నడిగారు మనం ఈ ఊరు దాటిన తరువాత మా ఊరు నేను వెళ్ళిపోతాను. మీఊరెక్కడో చెబితే ఏర్పాట్లుచేస్తాను.''

''నాకు...నాకు... చెప్పుకోవటానికి ఊరంటూ లేదు" ఆమె తలవంచింది.

అతడికి ఆ వయసు ఆడపిల్లల మాటలు నమ్మకూడదనే మనసులో ఉంది. కాని-ఇప్పుడు వినవలసిన అవసరం వచ్చింది. అక్కడినుంచి మెల్లగా, మంచిగా బయటపడటానికి ఆమె మాటలు వినవలసే వస్తుంది.

"పోనీ ఇక్కడుంటారా? టీచరు ఉద్యోగం చెయ్యచ్చు."

''నేనా?'' తల అడ్డంగా తిప్పింది.

ఆమెను బాగా ఎరిగిన మనిషి రామకోటి, అతడు ఆమె కాలవలో కొట్టుకు వస్తుండగా చూశాడు. ఆమెకు అందరూ పరిచర్యలు చేస్తుంటే చూసినవాడే. కాని ఆమె ఎక్కడినుంచి వచ్చిందని అందరూ ప్రశ్నిస్తుంటే జవాబు చెప్పలేదు.

వాళ్ళిద్దరూ భార్యాభర్తలా అని అందరూ ఊహాగానాలు చేస్తుంటే కూడా తనకు తెలిసిన విషయాన్ని బయటపెట్టలేదు. ఆమె ఏ విషయాన్ని గురించి ఎవరితో మాట్లాడినా రామకోటిని సంప్రదించాల్సి ఉంటుంది.

ఇంతవరకూ రామకోటి తనకు కనపడకపోవటానికి ఏదయినా కారణ మున్నదా?

ఆమె ఆలోచనలో పడ్డది. రామకోటికి మరేదయినా ప్లాను ఉందా?

ఆ గ్రామానికి పక్కగ్రామములో సమితిచైర్మెన్ పదవికి ఇటీవలే జరి గాయి ఎన్నికలు. ఆ ఎన్నికలకు ఓటువెయ్యటానికి విశాఖపట్నం నుంచి ఒక

శాసనసభ్యుడు వస్తున్నాడు. ఆయనకు రైల్వేస్టేషను దగ్గర స్వాగతమిచ్చి డాక్ బంగళాలో దింపటానికి అధికారపార్టీ సభ్యులు ఇద్దరు వస్తారు. ఆయన ఆరాత్రి అక్కడ వుండి తెల్లవారిన తరువాత వాళ్ళు తీసుకువచ్చే కారులో వెళ్ళి ఓటువేసి, మళ్ళీ అక్కడినుంచి విశాఖపట్నం వెళ్ళిపోతాడు.

అయితే ఆ శాసనసభ్యుడిని ఆ కారులో వెళ్ళి ఓటు వెయ్యకుండా చెయ్యాలంటే ఏంచెయ్యాలి?

అందుకు రామకోటి ఒక ప్లాను పకడ్బందీగా వేశాడు.

ఆ పార్టీవాళ్ళు ఆయనను డాక్ బంగళాలో దింపివెళ్ళి, తిరిగి చీకటిలో ఐదు గంటలకు గాని కారు తీసుకురారు. ఆయనకు బ్రేక్‌ఫాస్టు డాక్ బంగళాలోనే, గ్రామం వెళ్ళి ఓటువేసివచ్చి అక్కడే స్నానం, భోజనం ఆయనకు ఏర్పాటు.

ఈలోపల రామకోటి పాతికేళ్ళ వడుచు అంజనీతో రాత్రి సుమారు వది గంటలకు డాక్ బంగళాకువెళ్ళి ఆయనకు కావలసిన సౌకర్యాలు కల్పించి నాలుగు గంటలకే తాము వచ్చిన కారులో ఆయనను బయలుదేరదీసి, ఏభయిమైళ్ళ దూరంలో గ్రామముమీదుగా ఆయనను తీసుకురావటంలో, మధ్యదారిలో కారు చెడిపోయినట్లు ప్రకటించి- ఒంటిగంటకు కారు బయలుదేరదియ్యాలి. ఆకలిగా ఉన్న ఆయనకు ఆ గ్రామంలో పసందైన విందు చెయ్యాలి.

చేతిగడియారం చూసుకుంటూ ఓటింగ్‌టైము అయిపోతుందని అసహనంతో కేకలువేసే ఆయన "టైమయింతర్వాతవెళ్ళి వాళ్లకు ముఖం చూపించలేను. నన్ను రైల్వేస్టేషనుకు చేర్చండి" అన్న వెంటనే స్టేషనులో దింపెయ్యాలి. ఆయన అడిగితే టికెట్ కొని, రైలెక్కించాలి.

పర్యవసానం ఛైర్మెన్‌గా రామకోటి పార్టీ అభ్యర్థి వస్తాడు. ఈ పథకంలో రామకోటికి జయం లభించింది. ఉద్యోగంకోసం అతడిచుట్టూ తిరిగే అంజని అన్నివిధాలా సహకరించింది అతడితో.

అంజని అలా అతడికి ఎన్నివిధాలుగానో ఎన్ని పర్యాయాలో సహకరించింది. ఆమె సహాయంతో ఆ పార్టీకి బలవంతులైనవారు ఎన్నికయ్యారు. ఆమెకు నెలకు రెండువందలు దగ్గర దగ్గర చేతికందుతున్నాయి. కాని . ఆమెకు తానను కున్న ఉద్యోగం రాలేదు. దానికనువైన ప్రయత్నాలూ లేవు.

అంజనికి అక్కడ ఎంతోగౌరవము లభిస్తోంది. ఆ పార్టీలో ఆమె అధికారం చలాయిస్తుంది. సమయము సందర్భము వచ్చినప్పుడు ఆమె చేతిలో రెండు కార్లు ఉంటాయి. వేలకువేలు ఆమెచేతిమీదుగా ఖర్చుకూడా అవుతాయి.

ఇటీవల జరిగిన ఎన్నికల తరువాత రామకోటిదగ్గర వాగ్దానంకూడా తీసుకుంది - తనను విడుదల చెయ్యమని.

ఎందుకో అతడు తాత్సారం చేస్తున్నాడు.

అది కనిపెట్టి ఆమె రాత్రి పన్నెండుగంటల వేళ తన గదినుంచి కాలవ వెంట నడుస్తూ కొవ్వూరు వెళ్ళి రైలెక్కాలని ప్లాను వేసుకుని బయలుదేరింది. పంటకాలవమీద వేసిన చెక్కమీదుగా దాటబోయి కాలుజారి పడ్డది.

ఈ గ్రామస్తులలో చాలామంది ఎన్నికలలో పనిచేసేవారే, కాని తనకు బాగా తెలిసినవాళ్లు ఇంచుమించుగా లేరనే చెప్పాలి. ఏ ఒక్కడున్నా బయట పెట్టేవాడే.

రామకోటికి పీకలవరకూ కోపం వచ్చిందా? ఏమో?

తన పలాయనం అతడికి ఆగ్రహం తెప్పించి ఉంటుంది. అందుకు సందేహంలేదు.

ఆమెకొక ఆలోచన మెరుపులా మెరిసింది.

ఈ శేషగిరిని తాను ఉపయోగించుకుంటే?

ఇతడితో వెళ్ళి - ఇతడు ఒప్పుకుంటే పెళ్ళిచేసుకుంటే?

ఇంతకంటె మరీ లాభసాటి అయిన ఆలోచన తానసలు శేషగిరి భార్యేననీ, కోపం వచ్చి-తొందరపడి-పుట్టింటికి వచ్చినదాన్నని అందరితో చెబితే?

ఆమెకే ఆ ఆలోచన నచ్చలేదు. ఎందుకంటే రామకోటి అసలే నమ్మడు. అతడికి తెలిసిన తన చరిత్రలో పెళ్లే లేదు! పెళ్ళికొడుకూలేడు. ఇంకెలా?

ఈ ఆలోచనలతో ఆమె తల తిరిగిపోతున్నది.

తలుపు దగ్గరగా పెట్టిన మంచినీళ్ళ చెంబులోనుంచి ఒక గ్లాసెడు పోసుకుని తాగింది. కడుపు పట్టుకుంటూ వచ్చి మంచమ్మీద వాలిపోయింది.

సన్నగా ఏడుపు ప్రారంభించింది.

దిగ్గున లేచాడు శేషగిరి. లాంతరు పైకెత్తి వత్తి పెద్దదిచేశాడు. చేతితో దాన్ని ఎత్తి పైకి పట్టుకుంటూ "ఏమిటి ఇలా పడుకున్నారు?" అడిగాడు.

అతడికి భయంగా ఉంది-భార్యకు కడుపునొప్పిగా ఉంటే ఊరుకున్నాడంటారేమోనని.

ఇంతలో ఆ ఇంటి యజమాని లాంతరు పట్టుకుని వచ్చాడు ఆ గదిలోకి తలుపులు నెట్టుకుంటూ.

"అయ్యా! ఇక్కడెవరయినా వైద్యులున్నారా?" అడిగాడు శేషగిరి.

"ఇక్కడ హాస్పిటల్ చిన్నదయినా పెట్టించాలనీ, ఒక డాక్టర్ని ఉంచాలనీ ప్రయత్నం చేస్తున్నాం. మాచేత చాకిరి చేయించుకుంటారు ఓట్లసమయంలో. ఆ తరువాత మాట్లాడేవారు లేరంటే నమ్మండి బాబూ! నాటువైద్యుడున్నాడు దగ్గరలోనే. పిలిపిస్తాను" వెళ్ళి మనిషిని పంపించాడు.

రెండుగంటలకు గాని వైద్యుడు రాలేదు. నాడిచూసి మాత్రలు పంపించాడాయన పథ్యం చెప్పాడు.

రెండురోజులు గడిచాయి. ఆమె కడుపునొప్పి తగ్గలేదు.

''ఇటువంటినొప్పి ఇదివరలో ఎప్పుడయినా వచ్చిందా?" అందరూ ప్రశ్నిస్తున్నారు.

ఎటూకాకుండా తల తిప్పుతున్నాడు శేషగిరి.

"ఐదారేళ్ళ కిందట ఒకసారి వచ్చింది. రాజమండ్రి హాస్పిటల్లో డాక్టరు మందిచ్చారు, మళ్లీ వచ్చినప్పుడు ఆపరేషన్ చేస్తానన్నారు. నన్నక్కడికి తీసుకు వెళ్ళండి" శోకాలు పెడుతున్నది అంజని.

అటువంటి సమయంలో వచ్చాడు రామకోటి.

పదిమందివరకూ అంజని మంచంచుట్టూ చేరారు.

వారందరి దృష్టిలో అంజని శేషగిరి భార్య. రామకోటి ఆ సంగతిని విస్మరించలేదు.

"బాబూ! ఈమె కోరినట్టుగా రాజమండ్రి వెళ్ళి సర్జనుగారికి చూపిద్దాం పదండి. అంత బాధపడుతుంటే ఎట్లా చూస్తూ ఊరుకుంటాం? పదండి కొంత దూరం నడిస్తే ఏదయినా బండీ తగలవచ్చు. నేను తీసుకువస్తాను. మీరు సిద్ధంగా ఉండండి" విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఈ దెబ్బతో బయటపడవచ్చుకదా అని లోలోపల సంతోషించాడు శేషగిరి.

రామకోటి ఎక్కువ హైరాన పడకుండా అంజనిని, శేషగిరిని పడవమీద రాజమండ్రి తీసుకువెళ్ళటానికి ఏర్పాట్లు చేశాడు.

అంజని కడుపు చేతితో పట్టుకుని పడవలో ప్రవేశించింది.

ఆ రాత్రి శేషగిరికి పడవ ఆగినచోట భోజనం పెట్టించాడు రామకోటి. అంజని పాలు తాగింది.

పడవ లాగేవాళ్లు నలుగురు పాటపాడుతున్నారు. నీళ్ళకు మధ్య దారిచేసుకుంటూ పడవ మందంగా సాగిపోతున్నది. పడవలోఉన్న ప్రయాణీకులు ఎవరికి వీలయినట్టు వాళ్ళు నిద్రకొరిగారు. భోజనం చేసిన శేషగిరికి కన్నుమలిగింది.

రామకోటి నీళ్ళల్లోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

రెవిన్యూమంత్రిగారు ఈ ప్రాంతానికి క్యాంపులేసుకున్నారు. ఆ మూడో నాడు ఈ ఊరిమీదుగా కారులో వెళతారు. ఆయనతో కూడా ఇంకో కారులో అంజనితో వెళ్ళాలి. అందుకు ఒక చిన్న కారు మాట్లాడి ఉంచాడు. తను ఇన్ని సంవత్సరాలనుంచీ ఈ పార్టీలో పనిచేస్తున్నాడు. ఎంతో కష్టపడుతున్నాడు. డబ్బు కూడా వ్యయం చేస్తున్నాడు. కాని—తగినంత ప్రతిఫలము లభించటంలేదు. ఈసారైనా తనకు ఒక టికెట్ శాసనసభకు లభించే మార్గం చూడాలి.

నడిఝాము కాలేదు. రామకోటికి తటాలున శేషగిరి జ్ఞాపకం వచ్చాడు. ఇతడిని వదిలించుకోవటం ఎట్లా?

ఒక ఊళ్ళో పడవలాగేవాళ్ళు మారారు. పడవ ఐదు నిమిషాలకు పైగా ఆగింది. రామకోటి లాంతరు వెలుగులో ఒడ్డునున్నవాళ్ళను చూస్తున్నాడు.

అంజని మెల్లగా వెనకపక్కనుంచి దిగి ఒడ్డుమీదికెక్కింది. పడవ సాగు

తుండగా రామకోటి శేషగిరి పక్కన కూర్చున్నాడు. అతడిని మెల్లగా తట్టి లేపుతూ "ఏమండీ కొంచెం వేడిగా కాఫీ తాగుదామా ?" అంటున్నాడు.

అతడికి మనసులో ఆందోళనగా ఉంది. పక్కఊళ్ళో పడవ ఆగేచోటికి పదిగజాల దూరంలో జిల్లాపరిషత్ చైర్మెన్‌గారి జీపు ఆగిఉంటుంది. తనూ అంజనీ ఆ జీపులో ఎక్కి నరసాపురం వైపుగా వెళ్ళాలి. జిల్లాపరిషత్ చైర్మెన్‌కు తన చేతిలో ఉన్న సరుకు రుచిచూపించాలి.

శేషగిరి మంచి నిద్రలో ఉన్నాడు. ఇతడిని వదిలించుకోవటం పెద్ద కష్టం కాదు. అయినా మంచిమాటలతో వదిలించుకుంటేనే ఎందుకయినా మంచిది.

"కాఫీ తాగుదాము లేవండి" మళ్లీ పిలిచాడు.

అతడి ఆలోచనలు మళ్లీ కొనసాగుతున్నాయి.

రాజకీయ జీవితము చాలా ఆకర్షణీయమైనది. చాలా విచిత్రమైనది. ఒక్కొక్క సమయంలో మాట మర్యాదలకు లెక్కచేయనిది. అయినా ఎందరెందరు ఆ రంగంలో జీవిస్తున్నారు? పదవులను అందుకుంటున్నారు. ధనరాసులు సంపాదిస్తున్నారు. తన చిరకాలవాంఛ తీరాలని ఎంతగా శ్రమిస్తున్నాడు.

తను నాలుగైదు రకాలుగా - నలుగురిద్వారా ప్రయత్నిస్తున్నాడు.

ఇప్పటివరకూ ఏదీ ఫలించలేదు.

చేతిలో ఆడుతున్నట్టే కనబడుతుంది. కాని-డబ్బు చేతిలో నిలవటంలేదు.

అతడు మళ్లీ శేషగిరి భుజం తడుతూ కాఫీ ప్రశంస తెచ్చాడు.

"ఏందయ్యా! తేప తేపా కాఫీ కాఫీ అంటావు? నేను చుట్టముక్కతప్ప కాఫీ ముట్టనని తెలీదూ ?" కసిరినట్టు మాట్లాడాడు ముసుగులోనుంచి.

రామకోటి ఆ గుడ్డివెలుగులో చుట్టూ కలయజూశాడు.

శేషగిరి అక్కడ కనబడలేదు.

ఎక్కడ దిగాడు ?

ఎక్కడో దిగిఉంటాడు. అతడెక్కడ దిగినా ఎట్లా దిగినా రామకోటి

పట్టించుకోదలచలేదు, కాగా అతడిని ఎట్లా వదిలించుకోవాలనే అనుకుంటున్నాడు. ఇక తను అనుకున్నచోట దిగే ప్రయత్నం చెయ్యాలి.

భుజమ్మీద వేసుకున్న శాలువను సర్దుకుంటూ లేచాడు అంజని కూర్చున్న చోటు కొంచెం మరుగ్గా ఉంది. ఆమెను పిలుస్తూ వెళ్లాడు.

పడవ లాగేవాళ్ళ పాట చెవులలో ప్రతిధ్వనిస్తున్నది. పడుకోటానికి స్థలం లేనివాళ్ళు కునికిపాట్లు పడుతున్నారు. వాళ్ళను తప్పించుకుంటూ వెళ్ళాడు.

అతడు చూసినప్పుడు అంజనితోపాటు మరో స్త్రీ కూడా కూర్చుని ఉంది. ఇద్దరూ ఎక్కడ దిగారు ?

రామకోటి తల తడుముకుంటూ సరంగునడిగాడు "ఈ ఆడవాళ్ళిద్దరూ ఎక్కడ దిగారు ?" అని.

"దిగటం చూడలేదు బాబూ !"

రామకోటి ఆశలన్నీ వమ్మయిపోయాయి. జిల్లాపరిషత్ చైర్మెన్ ట్రిప్ వృధా అయిపోతుందా ఏమిటి ?

అంజని! పళ్ళు పటపట కొరికాడు. "దీని బాధంతా ఇన్నాళ్ళూ భరించాను. అక్కరకొస్తుందనుకున్నాను. మోసంచేసి పారిపోయింది."

రామకోటికి శేషగిరిమీద అనుమానం వచ్చింది. ఏమీ తెలియనట్టే ఉండి మోసంచేశాడు.

ఇద్దరూ ఒకసారే దిగిపోయారా ?

అతడు పడవ ఆగగానే ఒడ్డుకి దూకాడు. "జిల్లాపరిషత్ చైర్మెన్‌తో ఇంకేదో సాకు చెప్పాలి. ఆయనతో కూడా కేంపుపొడుగునా ఉండాలి. ఆయనను అనుసరించుకుని ఉండాలి.

రామకోటి జీపుదగ్గరికి నడిచాడు పెదవులు సాగదీసుకుంటూ.

"ఇంకేదయినా ఉపాయం ఆలోచించాలి. ఇంకెవరయినా తారసిల్లరా ? ఎవరికీ నాతో పని ఉండదా ?" గొణుక్కుంటూ సాగిపోతున్నాడు రామకోటి.

---